విద్యార్థుల ప్రమాణ స్వీకారం

దుండిగల్: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ఎస్ఐ గంగాధర్‌రావు అన్నారు. గండిమైసమ్మలోని రవీంద్ర భారతి గ్లోబల్ పాఠశాలలో నూతనంగా ఎన్నికైన విద్యార్థులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకెళ్లాలన్నారు. అనంతరం విద్యార్థులకు బ్యాడ్జిలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం జ్యోతి, ఏజెడ్‌వి కిశోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం



జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని మైసమ్మనగర్‌లో గురువారం బొడ్రాయి గ్రామ దేవత మొదటి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచే వందలాది భక్తులు తరలి వచ్చి బొడ్రాయికి పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కలశ పూజ, గణపతి పూజ, నవగ్రహాల పూజ అనంతరం బొడ్రాయికి పసుపు, కుంకుమ, గంధాలు, పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో రుద్రాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు. కార్పొరేటర్ కొలుకుల జగన్, బీజేపీ నాయకుడు మహేందర్, బొడ్రాయి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కబ్జాదారులను అరెస్టు చేయాలి

– సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యేసురత్నం



పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

నిజాంపేట్ : నిజాంపేట్ సర్వే నంబర్ 93 బృందావన్ హిల్స్ పార్క్ స్థలం కబ్జాదారులను వెంటనే అరెస్ట్ చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.యేసురత్నం డిమాండ్ చేశారు. గురువారం పార్కు స్థలాన్ని సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాల బిందెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బృందావన్ హిల్స్ కాలనీ ఏర్పడినప్పుడు స్థానికంగా ఉన్న సర్వే నంబర్ 93 ప్రభుత్వ భూమిలో కొంత స్థలాన్ని స్థానికంగా ఉన్న బృందావన్ హిల్స్ ప్రజల అవసరానికి పార్క్ కోసం కేటాయించారన్నారు. ప్రస్తుతం ఈ స్థలం కబ్జాకు గురవుతుందని, ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో తిరుమలరావు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ లైన్ల పీఎంఐ పనుల నేపథ్యంలో శుక్రవారం సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేట్‌బషీరాబాద్ ఏఈ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ వైష్ణవి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైష్ణవి ఎన్‌క్లేవ్, కల్యాణ్ కన్‌స్ట్రక్షన్స్, వనమాస్ స్క్వేర్, సిల్వర్ పార్కు, డీమార్ట్ పక్క గల్లీ, హర్ష ఆసుపత్రి లేన్‌లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

చింతల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 నుండి సాయంత్రం 5.30 గంటల వరకు ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ తిరుమలగిరి సబ్ స్టేషన్ కన్నాజీగూడ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తిరుమలనగర్, గ్రీన్ ఫీల్డ్స్ కాలనీ, కనజిగూడ, సాయి నగర్ కాలనీ, భూదేవి నగర్ సబ్ స్టేషన్ రామ్‌రాజ్ నగర్ ఫీడర్ పరిధిలో రామ్‌రాజ్ నగర్, శంకర్ ఎన్‌క్లేవ్, సమతా నగర్, ఉదయం 10 గంటల నుండి 11:30 గంటల వరకు భూదేవీ నగర్ సబ్ స్టేషన్ ఎల్ఎన్ కాలనీ ఫీడర్ పరిధిలో గాయత్రి అపార్ట్‌మెంట్స్, ప్రొడెన్షియల్ బ్యాంకు కాలనీ, మధ్యాహ్నం 2:30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు బోయినపల్లి సబ్ స్టేషన్ కళింగ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో లెజెండ్ రెసిడెన్సీ, ఏ.హెచ్.కే ప్యాకింగ్, ఆర్.ఆర్ టౌన్‌షిప్, నాగిరెడ్డి కాలనీ, వల్లభ్ నగర్, పోచమ్మ ఆలయం, మల్లికార్జున కాలనీ, పీపీ ఎన్‌క్లేవ్, శ్రీ సత్య రెసిడెన్సీ, వేంకటేశ్వర నివాస్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

155 మద్యం బాటిళ్లు సీజ్

– 600 వాహనాల తనిఖీ

దుండిగల్: దుండిగల్ పీఎస్ పరిధిలో గురువారం మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి ఆదేశానుసారం మేడ్చల్ జోన్ పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. డీ పోచంపల్లి 120 గజాల్లో 230 మంది పోలీస్ సిబ్బంది ఇంటింటికీ తనిఖీలు నిర్వహించారు. మొత్తం 464 ఇళ్లల్లో తనిఖీలు చేయగా.. ఇద్దరు వ్యక్తులు గంజాయి సేవించినట్లు గుర్తించారు. అదే విధంగా ముగ్గురు అనుమానితులు, ఇద్దరు రౌడీషీటర్లు ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ దాడుల్లో 155 మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. మొత్తం 600 వాహనాలను తనిఖీలు చేశారు. పెండింగ్ చలాన్‌లు ఉన్న 357 మంది వాహనదారుల నుండి రూ.1,02,330 నగదును వసూలు చేయడంతో పాటు 42 మందిపై ట్రాఫిక్ కేసులు నమోదు చేశారు. ఇతర రాష్ట్రాలకు చెందిన 1939 మంది నివాసముంటున్నట్లు పోలీసులు తెలిపారు.



ప్రభుత్వ స్థలంలో

ప్రైవేట్ రోడ్డు!



అనుమతులిచ్చిన అధికారులు

- కూల్చి వేయాల్సిన అధికారులు వత్తాసు పలకడంపై పలువురు ఆగ్రహం
- ప్రజావాణిలో ఫిర్యాదు

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేటలోని సర్వే నంబరు 166లో ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు సిల్వర్ ఓక్స్ స్కూల్ నుంచి గతంలో బండ్ల బాట ఉండేది. ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు సిల్వర్ ఓక్స్ స్కూల్ నుంచి కుడి వైపునకు దారిలో హెచ్ఎండీఏ మాస్టర్ ప్లాన్‌లో 100 ఫీట్ల రోడ్డు ప్రపోజల్‌లో ఉంది. కానీ ఎడమ వైపు వ్యవసాయ పొలాలకు వెళ్లే బండ్ల బాటను మాస్టర్ ప్లాన్‌లో ఉన్నట్లుగా చూపిస్తు 40 ఫీట్ల రోడ్డును వేసేందుకు పనులు మొదలు పెట్టారు. సుమారు అర కిలో మీటరు పైగా రోడ్డు పనులను చేపట్టి ఇరు వైపులా ఉన్న భారీ వృక్షాలను సైతం తొలగించారు.

బడా నిర్మాణ సంస్థ కోసమేనా..

రోడ్డు వేస్తే మంచిదే కదా అని కొందరు అంటుండగా దాని వెనుక ఓ పెద్ద మర్మమే ఉంది. ఈ అర కిలో మీటరు పైగా రోడ్డులో కొంత భాగం పట్టా భూమి ఉంది. మరి కొంత లావణ్య పట్టా ప్రభుత్వ భూమి ఉంది. ఈ దారి గుండానే ఓ బడా నిర్మాణ సంస్థ సుమారు 20 ఎకరాలు పైగా రైతుల నుంచి కొనుగోలు చేసి పెద్ద స్థాయిలో వెంచర్ వేసేందుకు సిద్ధపడింది. సదరు నిర్మాణ సంస్థ హెచ్ఎండీఏ నుంచి అనుమతులు పొందాలంటే కచ్చితంగా 40 ఫీట్ల రోడ్డును చూపించాల్సి ఉంటుంది. దీన్ని ఆసరాగా చేసుకుని ప్రభుత్వ స్థలం నుంచి రోడ్డు వేసే విధంగా అధికారులతో ములాఖత్ అయినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

అధికారుల అండతోనే?

పట్టా భూమితో పాటు ప్రభుత్వ లావణ్య పట్టా భూమిలో రోడ్డు వేసేందుకు హద్దులు చూపించాలని ఇటీవల మున్సిపల్ కమిషనర్ మండల తహసీల్దార్‌కు లేఖ రాశారు. వెంటనే స్పందించిన రెవెన్యూ అధికారులు ఆగమేఘాల మీద సదరు స్థలాన్ని సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు. రోడ్డు పనులు సైతం చకచకా ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడితే కూల్చివేయాల్సిన రెవెన్యూ అధికారులు దగ్గరుండి మరీ సర్వే చేయించడం, ప్రైవేట్ వ్యక్తులకు వత్తాసు పలకడం పలు విమర్శలకు తావిస్తోంది. అధికార పార్టీకి చెందిన ఓ స్థానిక నేత తన పలుకుబడిని ఉపయోగించుకుని సీఎం కార్యాలయం నుంచి తనకు పరిచయాలు ఉన్నాయని అధికారులను మచ్చిక చేసుకుని ఈ రోడ్డును దగ్గరుండి వేయించడం గమనార్హం. కాగా ఈ అర కిలో మీటరు మేరకు పట్టా, లావణ్య పట్టా భూమి ఉన్న రైతులకు నష్టపరిహారం చెల్లిస్తామని అధికారులు నోటీసులు ఇవ్వడం కొసమెరుపు. ఇటీవలే ప్రజావాణిలో అధికారుల తీరుపై ఫిర్యాదు చేశారు. ఉన్నతస్థాయి అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.



ప్రభుత్వ స్థలంలో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులు

కళాశాలలో వన మహోత్సవం



మొక్క నాటిన కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి

సుభాష్‌నగర్: దూలపల్లిలోని సెయింట్ మార్టిన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం వన మహోత్సవాన్ని నిర్వహించారు. 'మొక్కలు నాటండి.. ధరిత్రిని రక్షించండి' అనే నినాదంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ చంద్రశేఖర్‌యాదవ్, డైరెక్టర్ రవీంద్రలు హాజరై విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. మొక్కలు నాటడంతో పాటు పర్యావరణ పరిరక్షణ కోసం ఎలక్ట్రిక్ వాహనాలను ఉపయోగించాలని మర్రి లక్ష్మణ్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి వైద్య శిబిరం



కుత్బుల్లాపూర్: అజుదా హాస్పిటల్స్ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 9 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పేట్‌బషీరాబాద్ ఆవరణలో వైద్యం శిబిరం కొనసాగింది. శిబిరంలో సీబీపీ, ఆర్‌బీఎస్, సెరమ్ క్రియాటైన్, బ్లడ్ యూరియా, బ్లడ్ గ్రూప్, ఈసీజీ థైరాయిడ్ ప్రొఫైల్స్, లివర్ ఫంక్షన్ టెస్ట్‌లు ఉచితంగా నిర్వహించారు. పోలీసుల కుటుంబ సభ్యులు పరీక్షలు చేయించుకున్నారు. ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో పేట్‌బషీరాబాద్ సీఐ విజయవర్ధన్, ఎస్ఐలు, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు భరోసా

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి హన్మంత్‌రెడ్డి



లబ్ధిదారులకు చెక్కులందజేస్తున్న హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్ : సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు ఆర్థిక భరోసా లభిస్తుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. గురువారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధిని ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులైన 125 డివిజన్ శ్రీనివాస్ నగర్ వాసులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల ద్వారా ఎంతో మేలు చేకూరుతుందన్నారు. పేద ప్రజల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ బోనాలు



ఎల్లమ్మను దర్శించుకున్న దరువు అంజన్న

సుభాష్‌నగర్: గాజులరామారం మల్లారెడ్డి నగర్ 1 లోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో గురువారం ఆషాఢ మాసం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో బోనాలతో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ టూరిజం, సాంస్కృతిక శాఖ సలహాదారుడు దరువు అంజన్న అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మల్లారెడ్డి నగర్ కాలనీ అధ్యక్షుడు పద్మగిరి, ప్రధాన కార్యదర్శి సికిందర్ రావు, ఆలయ కమిటీ సభ్యులు ఓంకార్ రెడ్డి, శివరాజ్, హనుమంత్ రెడ్డి, రాంరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

నిజాంపేట్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని బీఆర్ఎస్ ఎన్ఎంసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివారెడ్డి అన్నారు. గురువారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 22వ డివిజన్ స్వామి వివేకానంద పార్కులో నిజాంపేట్ మున్సిపల్ శాఖ అధికారులు చేపట్టిన వందరోజుల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా స్థానిక కాలనీ వాసులు, మున్సిపల్ శాఖ అధికారులు పాల్గొని మొక్కలు నాటారు. అలాగే పార్కులో కావాల్సిన వాకింగ్ ట్రాక్, సెంట్రల్ లైటింగ్, వాటర్ సంపు, చిల్డ్రన్స్ ఎక్విప్‌మెంట్ కల్పించాలని మున్సిపల్ అధికారులకు స్థానికులు వినతిపత్రం అందజేశారు. అధికారులు స్పందించి స్థానిక సమస్యలపై మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



వీధి దీపాలు వెలగడం లేదని నిరసన



సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలో కొన్ని రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదు. అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో కొన్ని రోజులుగా దూలపల్లిలో అంధకారం నెలకొంది. అధికారుల తీరును నిరసిస్తూ అయ్యప్ప కాలనీ వాసులు కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వీధి దీపాలు వెలిగేలా చూడాలని కోరుతున్నారు.

అక్రమ నిర్మాణానికి అధికారుల అండదండలు!

- రూ.80 లక్షలు విలువ చేసే ప్రభుత్వ స్థలం
- గతంలో పనులు నిలిపివేసిన యంత్రాంగం
- మళ్లీ నిర్మాణం.. ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



ఏపీహెచ్‌బీ కాలనీ ఆర్చ్ పక్కనే ప్రభుత్వ స్థలంలో పూర్తైన అక్రమ నిర్మాణం

రంగారెడ్డినగర్: ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ ఏపీహెచ్‌బీ కాలనీ ఆర్చ్‌కు ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో మజర్‌ను ఏర్పాటు చేశారు. అయితే శాశ్వత ప్రాతిపదికన 80 గజాల స్థలంలో షెడ్డు వేసి చుట్టూ ప్రహరీ ఏర్పాటుకు యత్నించగా.. గతంలో కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పనులు నిలిపి వేశారు. గత ఆరు నెలలుగా అడపాదడపా పనులు చేపట్టిన సదరు నిర్మాణదారులు వారం రోజుల క్రితం అక్రమ నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఈ విషయమై ఏపీహెచ్‌బీ కాలనీ అసోసియేషన్ సభ్యులు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. అక్రమ నిర్మాణాన్ని రెండు గదులుగా నిర్మించి, ఒక గదిలో మజర్, మరో గదిలో వ్యాపారాన్ని నిర్వహించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. టౌన్ ప్లానింగ్ అధికారుల కనుసన్నల్లోనే ఈ నిర్మాణం పూర్తైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సుమారు రూ.80 లక్షలు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని అప్పనంగ కట్టబెట్టారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు.

అన్న ఇంట్లో చోరి చేసిన చెల్లి

– నిందితులను పట్టించిన సీసీ ఫుటేజీలు

జగద్గిరిగుట్ట: బంగారు నగలు, నగదు చోరీకి పాల్పడిన ముగ్గురు నిందితులను జగద్గిరిగుట్ట పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. జగద్గిరిగుట్ట షిర్డీహిల్స్‌లో శ్రీకాంత్ అనే వ్యక్తి తన కుటుంబంతో ఉంటున్నాడు. అతని తల్లిదండ్రులు కర్మాన్‌ఘాట్ భాగ్యనగర్ కాలనీలో నివాసముంటున్నారు. ఈ నెల 5న తండ్రి కొత్త కారు కొనుగోలు చేయడంతో పూజ నిమిత్తం శ్రీకాంత్ కుటుంబ సభ్యులతో వెళ్లాడు. శ్రీకాంత్ చెల్లెలు భర్త నుంచి విడిపోవడంతో తల్లిదండ్రుల వద్దే ఉంటుంది. మొబైల్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్ క్యాసినో ఆడే అలవాటు ఉన్న ఆమె రూ.5 లక్షలు పోగొట్టుకుంది. ఈ క్రమంలో అన్న శ్రీకాంత్ ఇంట్లో చోరీ చేసి అప్పులు తీర్చాలనుకుంది. తన స్నేహితులు కార్తీక్, అఖిల్‌లో పథకం పన్నింది. శనివారం అన్నయ్య కుటుంబం కర్మాన్‌ఘాట్‌కు రావడంతో రాత్రి వదిన బ్యాగ్‌లోని ఇంటి తాళాన్ని సత్కరించింది. అదే రోజు రాత్రి స్నేహితులైన కార్తీక్, అఖిల్‌లకు తాళం ఇవ్వడంలో అర్ధరాత్రి 12 గంటల సమయంలో షిర్డీ హిల్స్‌కు చేరుకున్న వారు ఇంటి తాళాలు తెరిచి బీరువాలో భద్రపరిచిన 12 తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, నగదును ఎత్తుకెళ్లారు. అనంతరం బంగారాన్ని ఆటికా గోల్డ్ లోన్ కంపెనీలో తాకట్టు పెట్టి నగదు తెచ్చారు. మరుసటి రోజు ఇంటికి వెళ్లిన శ్రీకాంత్ బీరువాలో ఉంచిన నగలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చోరీ వెనుక శ్రీకాంత్ చెల్లెలు హస్తమున్నట్లు నిర్ధారించారు. దీంతో ముగ్గురిని అరెస్ట్ చేసిన జగద్గిరిగుట్ట పోలీసులు గురువారం రిమాండ్‌కు పంపారు. చోరి నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన జగద్గిరిగుట్ట డీఐ నరేందర్‌రెడ్డి, పోలీస్ సిబ్బందిని బాలానగర్ డీసీపీ సురేష్ అభినందించి రివార్డును అందజేశారు.



ఘనంగా బోనాలు

చింతల్: చింతల్‌లోని రెయిన్‌బో జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల ఆవరణలో గురువారం బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. రెయిన్‌బో గ్రూప్ ఇనిస్టిట్యూషన్స్ చైర్మన్ శాంతి కుమార్‌యాదవ్, ఎండీ స్నేహలతల ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి బోనాలతో సందడి చేశారు. విద్యార్థుల కోలాటాల మధ్య పోతరాజు నృత్యాలు చేస్తూ ఆద్యంతం ఉత్రూతలూగించారు.

విద్యార్థులకు బలవర్ధక ఆహారం



కుత్బుల్లాపూర్: విద్యార్థులకు బలవర్ధకం, నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నామని మేడ్చల్ జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ సుగుణ అన్నారు. గురువారం ఆమె కుత్బుల్లాపూర్‌లోని మహాత్మా జ్యోతిరావ్ పూలే గరల్స్ వసతి గృహాన్ని సందర్శించారు. వంటశాలలో ఆహార పదార్థాల నిల్వలు, ఆహారం నాణ్యత, వండే విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులకు రుచితో కూడిన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఎటువంటి తేడా జరిగినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి

- అభివృద్ధి పనులకు రూ.12.28 కోట్ల నిధులు మంజూరు
- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: దశల వారీగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులు చేపడతామని, అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. కొంపల్లి మున్సిపల్ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు రూ. 12. 28 కోట్ల నిధులు మంజూరు చేయించిన నేపథ్యంలో గురువారం ఆయన స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. దూలపల్లిలోని పలు కాలనీలు, కొంపల్లి ఊరచెరువును పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు.. అనంతరం కాంగ్రెస్ నేత జెమ్మి దేవేందర్ నివాసంలో ఏర్పాటు చేసిన వివేకరుల సమావేశంలో అభివృద్ధి పనులను వివరించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథలోకి తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా లేబర్ సెల్ అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, కొంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరి ప్రశాంత్ గౌడ్, మాజీ సర్పంచ్ దేవేందర్, కౌన్సిలర్ శివ కుమార్ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ గోపాల్ రెడ్డి, మోహన్ రెడ్డి, కావాలి శివాజీ, అంజి, షేక్ ఇబ్రహీం, జయాభేరి గోపాలరెడ్డి, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



దూలపల్లిలో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ తదితరులు

నిధుల మంజూరు వివరాలు

- రూ. 70 లక్షలతో పీఎంఆర్ ఎన్‌క్లేవ్ (నియోలజీస్) నుండి దుర్గా నర్సరీ గార్డెన్స్ తాగునీటి పైపులైన్ పనులు.
- కొంపల్లి మున్సిపాలిటీ వార్డు నం.1లోని రాఘవల్ వేర్ హౌసింగ్ నుండి పామ్ మెడోస్ గేట్ వరకు ఇన్నోవేటివ్ స్పేస్‌లను క్రాఫ్టింగ్.
- రూ.1.50 కోట్లతో వార్డు నంబరు 1లో పామ్ మెడోస్ గేట్ నుండి శాంతి నగర్ కాలనీ మీదుగా స్ప్లెండిడ్ అపర్ణ పామ్ అవెన్యూ, సహజ సెరీన్ అపార్ట్‌మెంట్ నుంచి పట్టణ ప్రకృతి వనం మీదుగా అపర్ణ సెప్టిక్ ట్యాంక్ వరకు తాగునీటి పైపులైన్.
- రూ.45 లక్షలతో వార్డు నం.1లోని మికాసా స్టెర్లింగ్ రోడ్డు నుండి అపర్ణ పామ్ వరకు సీవరేజీ పైప్‌లైన్ పనులు.
- రూ.43 లక్షలతో వార్డు నం.06లో అను ఫర్నిచర్ నుండి లక్కీ టెంట్ హౌస్ వరకు సీసీ రోడ్డు.
- రూ.5 కోట్లతో వార్డు నం.1లోని ఊర చెరువు కట్ట సుందరీకరణ.
- రూ.35 లక్షలతో వార్డు నం.08లో శ్రీవేద నిలయం నుండి బాలాజీ విల్లాస్ వయా సాయి హంస నిలయం వరకు వైష్ణో ఎన్ క్లేవ్‌కు సీసీ రోడ్డు.
- రూ.3 కోట్లతో దూలపల్లి పారిశ్రామిక ప్రాంతంలోని దూలపల్లి ఎన్టీఆర్ విగ్రహం జంక్షన్ నుండి ధనరేఖ నిలయం వరకు బీటీ రోడ్డు.
- రూ. 50 లక్షలతో వార్డు నం.08లో సంజీవని మెడికల్ షాప్ నుండి విభ్రాంత్ విద్యుత్ అపార్ట్‌మెంట్, దుర్గా ఎన్ క్లేవ్ వరకు సీసీ రోడ్డు.